క్లుప్తంగా

నేటితో ముగియనున్న కుల గణన సర్వే

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వే చివరి దశకు చేరింది. శనివారం తెనాలి పట్టణంలోని అన్ని వార్డుల్లో వార్డు వలంటీర్లు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి..కులాల వారీగా వివరాలు నమోదు చేసి, ఇంటి సభ్యులలో ఒకరితో బయోమెట్రిక్ వేయించారు. ఆదివారంతో సర్వే ముగియనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



తెనాలిరూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని, వర్క్ ఫ్రం హోం, కరెంటు బిల్లు కట్టలేదని ఫోన్‌లకు సైబర్ నేరగాళ్లు మెస్సేజ్‌లు పంపుతుంటారని, వాటిని క్లిక్ చేయకూడదని తెలిపారు. ఏ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థ ఓటీపీ చెప్పమని అడగదని, అలా అడిగితే అది సైబర్ నేరగాళ్ల పనే అని గుర్తుంచుకోవాలన్నారు. ఇటీవల రోజుల వ్యవధిలోనే మూడు సైబర్ నేరాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టూ టౌన్ సీఐ బాధ్యతల స్వీకారం



తెనాలిరూరల్: తెనాలి టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ. సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ఆయన 2004లో పోలీసు విధుల్లో చేరారు. నెల్లూరు జిల్లా కావలిలో పని చేసిన అనంతరం సీఐడీ విభాగానికి మారారు. ఇప్పటి వరకు సీఐడీలోనే పని చేసిన ఆయన తొలిసారి గుంటూరు జిల్లాకు బదిలీపై సివిల్ పోలీస్ విభాగంలోకి వచ్చారు. ప్రజల తోడ్పాటుతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ సుధాకర్ తెలిపారు. నూతన సీఐకు స్టేషన్ సిబ్బంది, అభినందనలు తెలిపారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న ఎస్.వెంకట్రావు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

పాత పెన్షన్ సాధన సభను జయప్రదం చేయండి

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలో జరుగుతున్న పాత పెన్షన్ సాధన సభను ఉపాధ్యాయులు పాల్గొని, జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా కేదార్‌నాథ్ కోరారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు పాత పెన్షన్ సాధన సభకు హాజరవుతున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు రవిశంకర్, ప్రధాన కార్యదర్శి కాలే షావలి, గౌరవాధ్యక్షుడు రామకృష్ణ ప్రసాద్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు వరప్రతాప్ కుమార్, ఫణి, ఉమాదేవి, వహబ్, అనంతలక్ష్మి, భూపతి నాయుడు, హనుమంతరావు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

గుంటూరు ఈస్ట్: భార్యపై భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులు కలసి దిశ పోలీసుస్టేషన్ వెలుపల దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఫయాజ్‌ఖాన్ అతని భార్య నిహా పర్వీన్ గొడవ పడి విడిపోయారు. శనివారం ఇద్దరూ కుటుంబ సభ్యులతో కలసి దిశ పోలీసుస్టేషన్‌కు హాజరయ్యారు. ఆ తర్వాత స్టేషన్ నుంచి బయటకురాగానే ఫయాజ్‌ఖాన్ అతని కుటుంబ సభ్యులు నిహా పర్వీన్‌పై దాడి చేసి కొట్టారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె బకాయి అడిగినందుకు..

అద్దె బకాయి అడిగినందుకు ఓ వ్యక్తి అతని కుటుంబ సభ్యులు ఇంటి యజమానిపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురంలో నివసించే కె.లావణ్య తన ఇంటిని మణికంఠ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చింది. అతడు మూడు నెలలుగా అద్దె చెల్లించడం లేదు. శనివారం లావణ్య ఇంటికి వెళ్లి అద్దె చెల్లించాల్సిందిగా అడిగింది. మాటామాట పెరిగి మణికంఠ, అతని కుటుంబ సభ్యులు లావణ్యపై దాడి చేసి కొట్టారు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

వేజండ్ల(చేబ్రోలు): మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్లలో శనివారం జరిగింది. దళితవాడకు చెందిన వేజండ్ల కరుణమ్మ కొద్ది రోజులుగా కుటుంబసమస్యలతో సతమతమవుతోంది. శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. బంధువులు 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మద్యం సీసాలు స్వాధీనం

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. కోయవారిపాలెంలో రామినేని శ్యాంబాబు అక్రమంగా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో శనివారం హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు అతడ్ని అదుపులోకి తీసుకుని, ఐదు మద్యం సీసాల్ని స్వాధీనం చేసుకున్నారు.

మేలు చేసే ప్రభుత్వంతోనే ప్రజల జీవితాలు బాగు

వైఎస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీ సభలో ఎమ్మెల్యే శివకుమార్



నమూనా నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రజల జీవితాలు మెరుగుపడాలంటే మేలు చేసే ప్రభుత్వంతోనే సాధ్యమని, ఆ ప్రభుత్వానికి మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వహించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణంలోని 4–10 వార్డులకు సంబంధించిన 292 డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత ఆసరా కింద రూ.2.09 కోట్ల నగదు చెక్కును శనివారం ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. స్థానిక నాజరు పేటలోని పదో వార్డు సచివాలయం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక విస్మరించటం రాజకీయ నేతలకు పరిపాటిగా మారిన నేటికాలంలో.. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో 99.5 శాతం నెరవేర్చారని గుర్తుచేశారు. డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీ హామీని గత టీడీపీ ప్రభుత్వం నిలుపుకోలేదని విమర్శించారు. తన సుదీర్ఘ పాద యాత్రలో డ్వాక్రా అక్కచెల్లెమ్మలు తమ బాధలు చెప్పుకున్నప్పుడు రుణ మాఫీ చేస్తానని సీఎం హామీ ఇచ్చి, నాలుగు విడతలుగా రూ.25 వేల కోట్లను డ్వాక్రా సంఘాల ఖాతాల్లో వేసి గొప్ప భరోసానిచ్చారన్నారు. తెనాలి పట్టణంలో 1,498 డ్వాక్రా సంఘాల్లో 14,656 సభ్యులకు రూ.47.87 కోట్లను ఆసరా కింద ప్రభుత్వం ఇచ్చినట్లు ఎమ్మెల్యే శివకుమార్ వివరించారు. ఎన్నికల తరుణంలో మభ్యపెట్టి, తర్వాత పట్టించుకోని మోసగాళ్లను నమ్మొద్దని ప్రతిపక్షాలనుద్దేశించి ఎమ్మెల్యే శివకుమార్ హెచ్చరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ నేతలు, కౌన్సిలర్లు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, వీరిశెట్టి భాస్కర్, తోట రఘురాం, కోలా వాసు, ఉడుముల మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పశ్చాత్తాపంతో సత్ప్రవర్తనను అలవర్చుకోవాలి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీసీత

తెనాలిరూరల్: తప్పులు సరిదిద్దుకునేందుకే పరివర్తన శాలలు(జైళ్లు) ఉన్నాయని రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత అన్నారు. శనివారం స్థానిక సబ్ జైలును తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బందితో కలిసి న్యాయమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో, పొరపాటున తప్పులు, నేరాలు చేస్తారని, పశ్చాత్తాపంతో వాటిని సరిదిద్దుకోవాలన్నారు. ఇక నుంచైనా.. జీవితాలను సక్రమ మార్గంలో పయనించేలా మంచి నడవడికను ఈ పరివర్తన శాలలో నేర్చుకోవాలని సూచించారు. 2015 జ్యువైనల్ జస్టిస్ చట్టం గురించి వివరించారు. ఖైదీల బ్యారక్‌లు, వారికి అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. కారాగార సిబ్బందికి సూచనలు చేశారు. న్యాయమూర్తి వెంట తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాల్‌రావు, అప్పల కిషోర్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్ కుమార్, విజయ్ ఉన్నారు.

రెండు రోజుల పాటు కాచి చల్లార్చిన నీరు తాగాలి

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరానికి ప్రధాన నీటి వనరైన ప్రకాశం బ్యారేజీకి పులిచింతల నుంచి వస్తున్న నీటి సాంద్రత అధికంగా ఉందని, దీని వలన నగరపాలక సంస్థ ఫిల్టర్ రేషన్ పాయింట్స్ తగినంత నీటిని ఫిల్టర్ చేయలేకపోతున్నాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బ్యారేజీలో ముడి నీటి సాంద్రత అధికంగా మరో రెండు రోజులు ఉండే అవకాశం ఉందని, నగరంలో నీటి కొరత లేకుండా స్పెషల్ యాక్షన్ ప్లాన్ తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఉండవల్లి, తక్కెళ్లపాడు పంపింగ్ కేంద్రాల వద్ద వాటర్ సప్లై ఏఈ, డీఈఈలు ఆలం, క్లోరిన్ తగుపాళ్లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రిజర్వాయర్ల వద్ద కూడా సంబంధిత ఏఈ, డీఈఈలు తాగునీటిలో 2 పీపీఎం క్లోరిన్ ఉండేలా పర్యవేక్షణ చేయాలని కమిషనర్ సూచించారు. సచివాలయం పరిధిలో తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటీ కార్యదర్శులు క్లోరిన్ శాంపిల్స్ పరిశీలించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నగర ప్రజలు రెండు రోజులు పాటు కాచి చల్లార్చి తాగాలని, ఫిల్టరేషన్ సమస్య వల్ల ఏదైనా ప్రాంతంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినా సహకరించాలని ఆమె కోరారు.

ఉపాధ్యాయులే సమాజ మార్గ నిర్దేశకులు



పురస్కారాలు పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కన్న మాస్టారు, పార్వతి, డొక్కా మాణిక్య వరప్రసాద్, వెంకటేశ్వరరావు

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులే సమాజ మార్గ నిర్దేశకులని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు.కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సోషల్ సైన్సెస్ ఉపాధ్యాయుల ప్రతిభా పురస్కార మహోత్సవాన్ని శనివారం మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్ని సామాజిక అవగాహనతో పాటు బాధ్యతతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దడంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా విద్యా బోధనలో వచ్చిన సమూల మార్పుల కారణంగా విలువల స్థానంలో ఉపాధికి ప్రాధాన్యత నిచ్చే సైన్స్ అండ్ టెక్నాలజీలకు డిమాండ్ పెరిగిందన్నారు. ప్రప్రథమంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల్ని గౌరవించి సత్కరించే అవకాశం కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్టుకు దక్కడం గర్వకారణమని తెలిపారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చేస్తున్న విద్యా సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పౌరశాస్త్ర అధ్యాపకుడు నూతలపాటి వీరప్రకాశరావును విశిష్ట ప్రతిభా పురస్కారంతో సత్కరించడంతోపాటు 46 మంది సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల్ని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కో–ఆర్డినేషన్ డైరెక్టర్ పి.పార్వతి, వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత ఎస్.రామారావు, యూటీఎఫ్ కార్యదర్శి ఎం.కళాధర్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి కె.అలీన్, కె. విజయలక్ష్మి పాల్గొన్నారు.

నాట్కో ట్రస్టు సేవలకు అవార్డు



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ సదాశివరావు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పేద రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్న నాట్కో ట్రస్టు సేవలకు అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2015లో గుంటూరు జీజీహెచ్‌లో ఎలుకల దాడిలో పసికందు మృతి చెందిన సంఘటనపై చలించిపోయి నాట్కో ట్రస్టు చైర్మన్ నన్నపనేని వెంకయ్యచౌదరి జీజీహెచ్‌లో పిల్లల వార్డును రూ. 3కోట్లతో నిర్మించారు. అనంతరం రూ. 2 కోట్లతో వార్డులో వార్మర్లు, ఫొటోథెరపీ యూనిట్లు, సీప్యాప్ మిషన్లు ఏర్పాటు చేశారు. పసికందులకు అత్యవసర వైద్య సేవలు అందించే ఎన్ఐసీయూ, పీఐసీయూ వైద్య విభాగాలను 2017లో రూ. కోటితో ఆధునీకరించారు. న్యూరాలజీ వైద్య విభాగంలో నిద్ర సమస్యలకు చెక్ పెట్టేందుకు అవసరమైన రూ. 25 లక్షల ఖరీదు చేసే స్లీప్ ల్యాబ్ మిషన్‌ను అందజేశారు. నర్సింగ్ విద్యార్థులకు వసతి గృహంలో రూ. కోటితో పలు గదులు, మరుగుదొడ్లు నిర్మాణం చేశారు. ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో 2018లో రూ. కోటితో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ నిర్మించారు.

రాష్ట్రంలోనే మొట్టమొదటి క్యాన్సర్ సెంటర్‌ను నాట్కో ట్రస్టు గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్య సౌకర్యాలతో రూ. 45 కోట్లతో నిర్మించింది. ప్రతి ఏడాది రూ. 2 కోట్లకు పైగా ఖరీదు చేసే క్యాన్సర్ మందుల్ని రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. త్వరలోనే రూ.13 కోట్లతో క్యాన్సర్ చివరి దశలో ఉండే రోగుల కోసం ప్రత్యేకంగా భవనాన్ని నిర్మించేందుకు నాట్కో ట్రస్టు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 2015 నుంచి నిరంతరం జీజీహెచ్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న నాట్కో ట్రస్టు సేవలు వెలకట్టలేనివని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలి

కొల్లిపర: రేషన్ సరుకుల సక్రమంగా డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తహసీల్దారు జి.నాంచారయ్య సూచించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు రేషన్ పంపిణీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. రేషన్ సరుకుల సరిగా అందలేదని ఫిర్యాదులొస్తే.. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంపిణీపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సివిల్ సప్లయర్సు డిప్యూటీ తహసీల్దారు జేవీఎస్ఎన్ మూర్తి, ఆర్ఐ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

నేడు రోటరీక్లబ్ ఎక్స్‌లెన్సీ అవార్డుల ప్రదానం

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం వొకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు–2024 ప్రదానోత్సవం ఆదివారం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు ఏర్పాటయే సభకు క్లబ్ చైర్మన్ పావులూరి రాంబాబు అధ్యక్షత వహిస్తారు. రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ బాబు, కోళ్ల సింగారావు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. వివిధ రంగాల్లోని ప్రముఖులు సీహెచ్ శారదాదేవి (వైద్యం), ఎం.సురేంద్ర (మున్సిపల్), టి.శేషగిరిరావు (పాత్రికేయం), వి.కృష్ణయ్య (పోస్టల్), ఎస్.శారద (బ్యాంకింగ్), యర్రు బాపారావు (ప్రకృతి సేద్యం), ఎస్.రవీంద్రరెడ్డి (ఆర్టీసీ), టి.వెంకటేశ్వరరావు (న్యాయవాది), ఏవీఎల్ సంపత్ రాయుడు (ఆటో మొబైల్), ఎన్.సాంబయ్య (టీఎస్‌టీయూసీ), వి.శ్రీనివాసరావు (పోలీస్), షేక్ ఇనయతుల్లా (సామాజిక సేవ), సీహెచ్ శివ పార్వతి, పి.విజయలక్ష్మి (కళారంగం), పి.వెంకటేశ్వరరావు (క్రీడలు)కు రోటరీ ఎక్స్‌లెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. క్లబ్ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, కోశాధికారి కేవీఎల్ జగదీశ్వరాంబ వివరాలను తెలియజేశారు.

సర్వే సకాలంలో పూర్తికావాలి

కొల్లిపర: గ్రామాల్లో కుల గణన సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలో కొల్లిపర, తూములూరు, దావులూరు, హనుమాన్‌పాలెం, చివలూరు ఆయా గ్రామాల్లో జరిగిన కులగణన సర్వేను ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు సేకరించిన వివరాలపై ఆరా తీశారు. ప్రతి వలంటీర్, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటి వద్దకు వెళ్లి పకడ్బందీగా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన ఏవో చంద్రమోహన్, సచివాలయం సిబ్బంది , వలంటీర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంపిణీ

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్పయాత్ర శనివారానికి ఐదో రోజుకు చేరుకుంది. స్థానిక సీతమ్మ కాలనీ అంకమ్మ తల్లి గుడి వద్ద ప్రారంభమైన యాత్ర నల్లకుంట, జూట్ మిల్ కాలనీ, రామిరెడ్డి నగర్, శ్రీరామ్ నగర్, చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవాలయం వరకు సాగింది. ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ హాజరయ్యారు. వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ యాత్రలో భాగంగా శనివారం ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాల కరపత్రాలని ప్రజలకు అందించామని తెలిపారు.

గుంటూరు కళా పరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం

పాత గుంటూరు: రాజాగారితోటలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కళాపరిషత్ 26వ వార్షిక నాటక ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ సాహితీవేత్త బి. వేదయ్య కళావేదికపై నిర్వహించిన నాటికలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. పి.ఎస్. నారాయణ మూల కథ, పరమాత్ముని శివరాం నాటకీకరణ, రమేష్ మంచాల దర్శకత్వంలో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు 'స్వప్నం రాల్చిన అమృతం' సాంఘిక నాటిక ప్రదర్శించారు. కవి పీఎస్ఎం రచన, దర్శకత్వంలో ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు 'ఎనిమీ' సాంఘిక నాటిక ప్రదర్శించారు. కావూరి సత్యనారాయణ రచనకు, ఏపూరి హరిబాబు దర్శకత్వంలో గుంటూరు అమరావతి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు 'అమృత హస్తం' సాంఘిక నాటిక ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. అనంతరం జరిగిన సభకు కళా పరిషత్ అధ్యక్షులు పి.వి. మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వి. రామలింగయ్య, పౌరాణిక రంగస్థల కళాకారులు నలకా శ్రీనివాసరావు, కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి పూర్ణ, కార్యదర్శులు అమ్మిశెట్టి శివ, గుమ్మడి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొని కళాకారుల్ని సత్కరించారు.

లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

ఫిరంగిపురం: పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నట్లు తహసీల్దార్ పద్మనాభుడు శనివారం తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో 1377 మంది పేదలకు ఇంటి స్థలాలు ప్రభుత్వ అధికారులు పట్టాలు అందజేసినట్లు చెప్పారు. లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికిచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ ఉచితంగా చేసేందుకు సన్నద్ధం చేసినట్లు పేర్కొన్నారు. దానిలో భాగంగా ఆయా గ్రామాల వీఆర్వో(ఎగ్జిక్యూటివ్), గ్రామకార్యదర్శి (జాయింట్ సబ్‌రిజిస్టర్)గా ఉండి వారికి రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పిస్తున్నారని చెప్పారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారులను వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి తరువాత ఈకేవైసీ చేస్తారని తెలిపారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఈ ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులు పూర్తి వివరాలు, ఫోన్ నంబర్లును తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ఆన్‌లైన్ నమోదు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ షేక్, అబ్దుల్ రెహమాన్, కంప్యూటర్ ఆపరేటర్ భాస్కరరెడ్డి ఉన్నారు.

వెయ్యి మందితో భగవద్గీత పారాయణం



గ్రౌండ్‌లో ఏర్పాట్లు పరిశీలించి, మాట్లాడుతున్న బాల స్వామీజీ

తెనాలిటౌన్: కొత్త పేటలోని తాలూకా హై స్కూల్ గ్రౌండ్‌లో సోమవారం నుంచి శ్రీ గోవింద నామ జపయజ్ఞ పూర్ణాహుతి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు బాల స్వామీజీ తెలిపారు. గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో బాల స్వామీజీ మాట్లాడారు. ఆ రోజు ఉదయం భగవద్గీతా పారాయణం జరుగుతుందన్నారు. మైసూరు సచ్చిదానంద స్వామి శిష్య బృందం వేయిమందితో నిర్వహించే భగవద్గీత పారాయణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆదివారం సాయంత్రం మార్కెట్ వద్ద గల రామాలయం నుంచి గాంధీ చౌక్ మీదుగా తాలూకా హైస్కూల్ వరకు నగరోత్సవం జరుగుతుందని తెలిపారు. స్వామీజీ వెంట సాలిగ్రామ మఠం ట్రస్ట్ అధ్యక్షుడు నంబూరు వెంకటకృష్ణమూర్తి, ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య, కోన నాగేశ్వరరావు, గోపు ప్రభారాణి, రామకృష్ణ మురళీ, శ్రీ దత్తపీఠం గుంటూరు శాఖ సభ్యులు సీతారామిరెడ్డి, సుస్మిత, కన్యాకుమారి, సాలిగ్రామ మఠం, శ్రీవిద్యాపీఠం , జయలక్ష్మి మాత్రు మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు నన్నపనేని వెంకట్రావు వర్ధంతి కార్యక్రమాలు



మాట్లాడుతున్న నన్నపనేని సుధాకర్

తెనాలి: పట్టణానికి చెందిన సీనియర్ రాజకీయ నేత, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని వెంకట్రావు 44వ వర్ధంతిని ఆయన స్థాపించిన వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజి వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. కాలేజి కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయం 8 గంటలకు నన్నపనేని సమాధి స్థలి సమతా వనంలో రాజకీయ ప్రముఖులు, అధ్యాపకులు, అభిమానులు నివాళులర్పిస్తారని తెలిపారు. అనంతరం కాలేజిలో జరిగే వ్యవస్థాపక దినోత్సవంలో నన్నపనేని వెంకట్రావు పేరిట విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, క్రీడా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ నరసింహమూర్తి, ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ



విద్యుత్ శాఖ ఈఈ చిరంజీవి

తెనాలిటౌన్: ఏపీ సీపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు చెంచుపేటలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విశాఖపట్నం నుంచి జరుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వి.చిరంజీవి తెలిపారు. డివిజన్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ సేకరించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు పాల్గొనాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని ఈఈ చిరంజీవి తెలిపారు.

15 ఏళ్ల సమస్యకు ఆపరేషన్‌తో విముక్తి

70 ఏళ్ల వృద్ధుడికి అరుదైన ఆపరేషన్

గుంటూరు మెడికల్: రెండు మోకాళ్లలో తీవ్రమైన నొప్పులతో 15 సంవత్సరాలుగా బాధపడుతున్న 70 ఏళ్ల వృద్ధుడికి అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్ చేసి నొప్పి మాయం చేశామని శ్రీరామచంద్ర జాయింట్ రీ ప్లేస్‌మెంట్ సెంటర్‌కు చెందిన సర్జన్ డాక్టర్ పోట్ల శివయ్య చెప్పారు. స్థానిక డొంక రోడ్డులోని ఆస్పత్రిలో శనివారం జరిగినవిలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలను ఆయన వెల్లడించారు. బాపట్ల జిల్లా కొలగానివారిపాలేనికి చెందిన 70 ఏళ్ల దాడి వెంకటేశ్వర్లు 15 ఏళ్లుగా రెండు మోకాళ్లలో తీవ్రమైన నొప్పులతో బాధపడుతూ, నడవలేక మంచానికే పరిమితమయినట్లు తెలిపారు. కుడి మోకాలు లోపల 40 డిగ్రీలు, ఎడమ మోకాలు 50 డిగ్రీలు వెలుపలకు వంగిపోయి ఉన్నట్లు వెల్లడించారు. వైద్య పరిభాషలో ఈ వ్యాధిని 'విండ్ స్వెప్ట్ డిఫార్మిటీ ' అంటారన్నారు. పలువురు వైద్యులను కలిసినా నొప్పి తగ్గక, తమ ఆస్పత్రికి 2023 నవంబర్‌లో వచ్చినట్లు చెప్పారు. పరీక్షలు చేసి, నవంబర్ 27 కుడి మోకీలు మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామన్నారు. మరలా 2024 జనవరి 23న అమెరికా నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న ఇంప్లాంట్స్‌తో ఎడమ మోకీలుకు సుమారు ఐదు గంటల సేపు ఆపరేషన్ చేసి నొప్పి, ఒంకర, ఇతర సమస్యలు లేకుండా చేశామని వివరించారు. సమస్యలు లేకపోవడంతో శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు.